కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :140 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 19-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

కాంగ్రెస్ నేతల పర్యటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందన

సిద్దిపేట,సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నేతల పర్యటన, భూముల పరిశీలన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. కాంగ్రెస్ నేతలు తన భూములను పరిశీలించేందుకు వస్తున్నారని చెబుతున్నారని, ఇందుకోసం భారీగా పోలీసు బందోబస్తు ఎందుకని ప్రశ్నించారు. “నాకు ముందే చెబితే.. దగ్గరుండి అన్నీ చూపించేవాడిని. కడుపునిండా అన్నం పెట్టి పంపించే వాడిని” అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను పలు వార్తా సంస్థలు శుక్రవారం నివేదించాయి.

‘అంత మంది పోలీసులెందుకు?’

“కాంగ్రెస్ వాళ్లు సిద్దిపేటకు వస్తున్నారట.. నా భూములు చూసి వెళ్తారట. వందల మంది పోలీసులు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, రోప్ పార్టీలు, డ్రోన్లు ఎందుకు?” అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తాను సిద్దిపేటలోనే ఉన్నానని, తనను సంప్రదిస్తే భూములను స్వయంగా చూపించేవాడినని అన్నారు. “ఉన్నది ఉన్నట్లుగా చెప్పండి.. అబద్ధాలు చెప్పొద్దు. నా జీవితం తెరిచిన పుస్తకం” అని పేర్కొన్నారు.

‘అఫిడవిట్లలోనే ఆస్తుల వివరాలు’

తన భూములు, ఆస్తుల వివరాలను ప్రతి ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా వెల్లడించానని హరీశ్‌రావు తెలిపారు. సర్వే నంబర్లతో సహా వివరాలు ఇచ్చామని చెప్పారు. రామంచలో తనకు 13 ఎకరాల భూమి ఉంటే, దానికి భిన్నంగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తాను దాచింది ఏమీ లేదని, కొత్తగా బయటపెట్టాల్సిన విషయం కూడా ఏమీ లేదని హరీశ్‌రావు అన్నారు. భూముల విషయంలో తనపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు.

‘ఏడు సార్లు గెలిపించారు’

సిద్దిపేట ప్రజలు తన పనితీరును చూసే ఏడు సార్లు గెలిపించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేటను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దామని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల ప్రజలు ఇక్కడి అభివృద్ధిని పరిశీలించి వెళ్లారని అన్నారు. “ఏ పని చేసినా పది తరాలకు ఉపయోగపడేలా సిద్దిపేటను అభివృద్ధి చేసుకున్నాం” అని పేర్కొన్నారు.

‘సిద్దిపేటకు వచ్చేవారికి ఆతిథ్యం ఇస్తాం’

సిద్దిపేట అంటే ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా అని హరీశ్‌రావు అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఎవరొచ్చినా కడుపునిండా అన్నం పెట్టి, ప్రేమగా మాట్లాడతామని చెప్పారు. కాంగ్రెస్ నేతలు భయపడాల్సిన అవసరం లేదని, పోలీసుల భారీ బందోబస్తు లేకుండానే రావచ్చని వ్యాఖ్యానించారు.

భూముల వ్యవహారంపై రాజకీయ దుమారం

ఎర్రవల్లి, వెంకటాపూర్ తదితర ప్రాంతాల్లోని భూములపై ప్రస్తుతం రాజకీయంగా వివాదం కొనసాగుతోంది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములపై రెవెన్యూ అధికారులు సర్వే, రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీల బృందం సిద్దిపేట జిల్లాలో పర్యటించి భూముల వివరాలను పరిశీలిస్తోంది. కాంగ్రెస్ నేతలు భూములపై పలు ఆరోపణలు, ప్రశ్నలు లేవనెత్తుతుండగా.. హరీశ్‌రావు మాత్రం తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించామని చెబుతున్నారు. ఈ భూముల యాజమాన్యం, ప్రభుత్వ భూముల స్థితిపై తుది నిర్ధారణ అధికారిక రెవెన్యూ రికార్డులు, సర్వే, సంబంధిత విచారణ నివేదికల ఆధారంగానే జరగాల్సి ఉంటుంది.

పిల్లల చదువుపైనా హరీశ్‌రావు సూచనలు

సిద్దిపేట పర్యటన సందర్భంగా పిల్లల విద్యపై కూడా హరీశ్‌రావు మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకుల పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణ ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారని పేర్కొంటూ.. బోనాలు, బతుకమ్మ వంటి పండుగలను ఎక్కడున్నా నిర్వహిస్తూ మన మూలాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఫాస్ట్ ట్రాక్ లో 22-ఏ పరిష్కారం.. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

హైదరాబాద్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా 22-ఏ కు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం నాడు శాసనసభలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించి జీ.ఓ.ఆర్.టి నెం. 564 ను , జారీచేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్ గా సిసిఎల్ఎ డి.ఎస్. లోకేష్ కుమార్ వ్యవహరిస్తారు. లా సెక్రటరీ, పాపి రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఐ.జీ. రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా ఆనాడు ఎల్ బి నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఉన్న రెగ్యులరైజేషన్ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఎల్.బి. నగర్ నియోజకవర్గంలో 118 జీ.ఓ. ప్రకారం 9,700 ప్లాట్ల రేగ్యులరైజేషన్ కు సంబంధించిన మెమోను శుక్రవారం నాడు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ జీ.ఓ. ప్రకారం ఆ ప్రాంతంలో రేపటి నుంచి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. దశాబ్దాల కాలంగా అక్కడ ప్లాట్లు తీసుకొని ఇండ్ల నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్న ఇండ్ల యజమానులు 118 జీ.ఓ. ప్రకారం స్థానిక అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారుసింగరేణి ప్రాంతంలో ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవో 76ను జారీ చేశారని ఆ జీవోను అనుసరించి శనివారం నాడు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కగారి ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు.అలాగే రెవెన్యూ రికార్డులలో 22ఎలో ఉండి హెచ్ఎండిఎ ,డిటిసిపి,జిహెచ్ఎంసీ అనుమతులతో లేఅవుట్లు వేసిన ప్రాంతాలను 22ఎ నుంచి తొలగించే విషయంలో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిశాసనసభలో ప్రకటించిన 10-12 అంశాలపై నెలరోజుల వ్యవధిలోనే నిర్ణయం తీసుకొని 22ఎ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తామని సభలో ప్రకటించారు.

22ఏపై సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అభ్యంతరం

హైదరాబాద్,మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. సీఎం సభను తప్పుదోవ పట్టించేలా తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టి. పద్మారావు గౌడ్, గంగుల కమలాకర్ అసెంబ్లీ స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు.

22-ఏ భూములపై చర్చ సందర్భంగా..

ఈ నెల 16న అసెంబ్లీలో 22-ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, ఆయన కుటుంబానికి సంబంధించిన భూములపై పలు వివరాలను ప్రస్తావించారు. వివిధ ప్రాంతాల్లోని భూముల వివరాలను సభలో వెల్లడించిన సీఎం.. ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూములపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబానికి చెందిన భూముల విషయంలో సీఎం చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు.

‘సభను తప్పుదోవ పట్టించారు’

కేసీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేయడంతో పాటు, భూములకు సంబంధించి తప్పు సమాచారాన్ని సభ ముందు ఉంచారని పద్మారావు గౌడ్, గంగుల కమలాకర్ తమ నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాదన ప్రకారం.. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం, సభకు తప్పుడు సమాచారం అందించడం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని వారు పేర్కొన్నారు.

విచారణకు ఆదేశించిన సీఎం

మరోవైపు ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై వచ్చిన ఆరోపణలను పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన మొత్తం భూమి, దాని యాజమాన్య హక్కులు, ప్రభుత్వ భూముల అంశాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ అంశంపై అధికారిక విచారణ పూర్తయిన తర్వాతే భూముల స్థితిగతులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మరోసారి రాజకీయ వేడి

కేసీఆర్ కుటుంబ భూముల వ్యవహారం నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. సీఎం అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతుండగా.. భూములపై వాస్తవాలను తేల్చేందుకే విచారణకు ఆదేశించినట్లు అధికారపక్షం చెబుతోంది. తాజాగా ప్రివిలేజ్ నోటీసు ఇవ్వడంతో ఈ వ్యవహారం మరోసారి అసెంబ్లీ వేదికగా చర్చకు వచ్చే అవకాశం ఏర్పడింది.

ఫార్ములా ఈ-రేసు కేసులో కోర్టుకు హాజరైన కేటీఆర్..

హైదరాబాద, సెప్టెంబర్ 18,ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు.గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణ ఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.

కేటీఆర్ సిబ్బంది విచారణ: సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచండి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైఫాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు.

విదేశాల్లోని తెలంగాణవాసుల సమస్యలకు 'సింగిల్ విండో' వ్యవస్థ

హైదరాబాద్,విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్రంలో ప్రత్యేక ఎన్ఆర్ఐ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం

అమెరికా, గల్ఫ్ దేశాలు, యూరప్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో నివసిస్తున్న తెలంగాణవాసులు రాష్ట్రానికి వివిధ రూపాల్లో సహకరిస్తున్నారని వారు పేర్కొన్నారు. పెట్టుబడులు, రెమిటెన్స్‌లు, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, వైద్యం, దాతృత్వ కార్యక్రమాల ద్వారా తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాము లవుతున్నారని తెలిపారు. అయితే విదేశాల్లో ఉంటున్న సమయంలో స్వరాష్ట్రంలో ఎదురయ్యే ఆస్తి, భూమి వివాదాలు, పత్రాల సమస్యలు, మోసపూరిత లావాదేవీలు, కుటుంబ అత్యవసర పరిస్థితులు, చట్టపరమైన సమస్యలు పరిష్కరించుకోవడంలో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

సింగిల్ విండో'గా ఎన్ఆర్ఐ కమిషన్

ప్రతిపాదిత కమిషన్‌ను ప్రభుత్వం–ఎన్ఆర్ఐల మధ్య అనుసంధాన వ్యవస్థగా రూపొందించాలని వారు సూచించారు. ఎన్ఆర్ఐలు, వారి కుటుంబాల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఇందులో ప్రధాన బాధ్యతలుగా ఉండాలని కోరారు. ఆస్తులు, భూములు, చట్టపరమైన వ్యవహారాల్లో అవసరమైన సహాయం అందించడంతో పాటు మోసపూరిత లావాదేవీలు, ఆస్తుల దుర్వినియోగం వంటి సమస్యల నుంచి ఎన్ఆర్ఐలను రక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.

విదేశాల్లో అత్యవసర పరిస్థితులకూ సమన్వయం

విదేశాల్లో తెలంగాణవాసులు ఎదుర్కొనే అత్యవసర పరిస్థితుల్లో తక్షణ మార్గదర్శకత్వం, సహాయ సమన్వయం అందించేలా కమిషన్ పనిచేయాలని సూచించారు. విదేశాల్లోని తెలంగాణ సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

వర్షాలు తగ్గాయి..వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగింది..

హైదరాబాద్,ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.ప్రపంచ పటాలు పరిశీలించండివర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు.ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. PMAY G పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లను కేటాయించిన విషయాన్ని ప్రస్తావిస్తూ అందుకు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

సంపాదకీయం

శనివారం 19-09-2026

ఐరోపాలో మారుతున్న రాజకీయాలు

జర్మనీలో ఇటీవల జరిగిన సక్సోనీ-యాన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో అతిమితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీ 44శాతం ఓట్లు గెలుచుకోవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత జర్మనీలో ఒక అతిమితవాద పక్షం ఇంత విజయం సాధించడం ఇదే ప్రథమం. ఇప్పటివరకు సామ్యవాద, సంక్షేమ సూత్రాలకు పట్టంకడుతూ వచ్చిన ఐరోపాలో మళ్లీ నాజీ, ఫాసిస్టు భావజాలం మొగ్గతొడుగుతోందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఐరోపాలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. కొవిడ్ వల్ల సరఫరా గొలుసులు విచ్ఛిన్నం కావడం, అమెరికా-చైనా ఆర్థిక వైరం పెరుగుతుండటం, డొనాల్డ్ ట్రంప్ తమ పర భేదం లేకుండా చిరకాల యూరోపియన్ మిత్రదేశాల పైనా ఆంక్షల అస్త్రం ఝళిపించడం వంటివి ఆ ఖండంలో ఆర్థికంగా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా ఐరోపా దేశాలకు ట్రంప్ పూర్తి అండదండలు ఇవ్వకపోవడం, రక్షణ బడ్జెట్‌ను పెంచుకోండంటూ దబాయించడం, ఐరోపాలోని అతిమితవాద పక్షాలవైపు అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మొగ్గు చూపడం రాజకీయంగా చిక్కు పరిస్థితిని సృష్టిస్తోంది. మారిన ప్రపంచ ఆర్థిక వాతావరణంతో ఐరోపా దేశాల్లో జీవన వ్యయంతో పాటు ప్రభుత్వాలపై రుణభారమూ గణనీయంగా పెరుగుతోంది. ఇలాంటి తరుణంలోనే ఐరోపా దేశాలకు వలసలు పోటెత్తుతుండటం అక్కడి ప్రజల్లో నిరసనాగ్రహాలను రేపుతోంది. వలసదారుల వల్ల తమకు ఎంట్రీ స్థాయి ఉద్యోగాలు దొరక్కుండా పోతున్నాయనీ, నిరుద్యోగం పెరుగుతోందనీ ఐరోపా యువత భావిస్తోంది.

ఉక్రెయిన్‌కు సాయంపై ఆగ్రహం

వచ్చే ఏడాది ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోలాండ్, గ్రీస్, ఫిన్లాండ్, ఎస్టోనియా, స్లొవేకియా, స్లొవేనియా దేశాల్లో కీలకమైన పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి తోడు జర్మనీలో ఫెడరల్ అధ్యక్ష పదవికి పరోక్ష ఎన్నికను నిర్వహిస్తారు. ఇలాంటి కీలక సమయంలో అక్కడి సక్సోనీ-యాన్‌హాల్ట్ రాష్ట్రంలో ఏఎఫ్‌డీ విజయం సాధించడాన్ని ఐరోపా మొత్తానికి ఒక హెచ్చరికగా విశ్లేషిస్తున్నారు. ఫ్రాన్స్‌లో అతిమితవాద నాయకురాలు మరీన్ లే పెన్ ఇప్పటికే ముందంజలో ఉన్నట్లు ప్రజాభిప్రాయ సేకరణలు సూచిస్తున్నాయి. ఇంతకాలం ఐరోపా దేశాల్లో అతిమితవాద పార్టీలకు జనాదరణ అంతంత మాత్రంగానే ఉండేది. ఇవి ఎప్పుడైనా కాస్త చెప్పుకోదగ్గ సంఖ్యలో ఓట్లు, సీట్లు సాధించినా కన్సర్వేటివ్(మితవాద) పార్టీలు, వామపక్ష, సోషలిస్టు పక్షాలు పరస్పరం చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ వచ్చాయి. అలా అతిమితవాదులను అవి అధికారానికి దూరంగా ఉంచుతున్నాయి. కానీ, ఈసారి జర్మనీలో రాష్ట్రస్థాయిలో ఏఎఫ్‌డీ సొంతంగా 44శాతం ఓట్లు సాధించడంతో వచ్చే ఏడాది ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో అతిమితవాదులు సొంతంగా, సాధారణ మెజారిటీనైనా సాధిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అతిమితవాదులకు మెజారిటీ రాకపోయినా ఐరోపా పార్లమెంట్లలో వారి బలం పెరిగితే వలసలు, జాతీయ భద్రత, వాతావరణ మార్పుల నిరోధంపై ఆయా దేశాలు సమష్టి సహకారం సాధించడం కష్టమవుతుంది. ఏఎఫ్‌డీ మాదిరిగానే హంగరీకి చెందిన ఫిడెజ్ వంటి అతిమితవాద పార్టీలు ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాల ఆర్థిక సాయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ యుద్ధం వల్లే జర్మనీకి చవకైన రష్యన్ చమురు, గ్యాస్‌ల ఎగుమతి నిలిచిపోయి ద్రవ్యోల్బణం పెరిగిందని ఏఎఫ్‌డీ విమర్శిస్తోంది. ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపేయాలనీ, రష్యన్ ఇంధన దిగుమతులను పునరుద్ధరించాలనీ ఏఎఫ్‌డీ సక్సోనీ-యాన్‌హాల్ట్ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. ఇక ఫ్రాన్స్‌లో ప్రాబల్యం పెంచుకుంటున్న అతిమితవాది మరీన్ లే పెన్‌కు రష్యాతో ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. లే పెన్ పార్టీ అయిన నేషనల్ ర్యాలీ రష్యాతో సంబంధం ఉన్న బ్యాంకుల నుంచి గతంలో పెద్దమొత్తంలో రుణాలు పొందింది. లే పెన్ ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను వ్యతిరేకిస్తున్నా, 'యుద్ధం ముగిశాక ఈయూ-రష్యా మధ్య సయోధ్య'ను వాంఛిస్తున్నారు. అలాగని ఐరోపా దేశాల్లోని అతిమితవాద పార్టీలన్నీ రష్యాకు అనుకూలం కాదు.

జనాకర్షణను తగ్గించే ప్రయత్నాలు

ఏఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వంటి అతిమితవాద పార్టీలకు పార్లమెంటులో మెజారిటీ దక్కకుండా చూడటానికి మితవాద-మధ్యేవాద, వామపక్ష-మధ్యేవాద పార్టీలు, వాటి ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేయనారంభించాయి. ఏఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వంటి పార్టీల నినాదాలు, విధానాల్లోని కొన్ని అంశాలను స్వీకరించడం ద్వారా వాటిపై జనాకర్షణను తగ్గించేందుకు అవి ప్రయత్నిస్తున్నాయి. సరిహద్దులను కట్టుదిట్టం చేస్తూ వలసలను నిరోధిస్తున్నాయి. ఆశ్రయం కోరిన వలసదారులను వేగంగా తిప్పిపంపే ప్రక్రియనూ చేపడుతున్నాయి. వలసలతోపాటు ద్రవ్యోల్బణం, అధిక ఇంధన ధరలు వంటి అంశాలు ఓటర్లను అతిమితవాదులవైపు ఆకర్షిస్తున్నాయని గ్రహించి, హరిత ఇంధనాలకు మారే ప్రక్రియను ఆలస్యం చేస్తున్నాయి. ఏతావాతా 2027లో జరిగే ఎన్నికలు, ఫలితాలు ఐరోపాపై రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

రాహుల్ బలమా... బలహీనత..

న్యూఢిల్లీ,రాహుల్ గాంధీది భారత రాజకీయాల్లో ఒక నిలకడ లేని గ్రాఫ్! అది కొన్ని సార్లు పైకి, మరికొన్నిసార్లు కిందకి చలిస్తూ ఉంటుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలు సదా అనిశ్చితిలో ఉంటున్నాయి. దాని ప్రతికూల ప్రభావం 'ఇండియా కూటమి' మీద పనిచేస్తోంది. రాహుల్ ప్రాధాన్యతలు, ప్రవర్తన, మిత్రులతో సయోధ్య వంటి అంశాలు ఈ మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మీడియా, సెఫాలజీ సంస్థల అంచనాలకు మించి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలతో ఏర్పడ్డ 'ఇండియా కూటమి' మెరుగైన ఫలితాలు సాధించింది. దేశంలోని 16 ముఖ్య సెఫాలజీ సంస్థలు ఇండియా కూటమి సంఖ్య 150 దాటదని జోస్యం చెప్పినా, 240 స్థానాలు పొంది ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇచ్చింది. 400 సీట్ల వారి కలల్ని కల్లలు చేసి, 290కి పరిమితం చేసింది. కానీ, తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పక్షాలు దారుణంగా దెబ్బతిన్నాయి. సానుకూల ఫలితాలకు ఆస్కారమున్న మహారాష్ట్ర, హర్యానా, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా చతికిలపడ్డాయి. ఇందుకు ప్రధానంగా రాహుల్ (గ్రాఫ్) నిలకడలేని తనమే కాకుండా మిత్రపక్షాలతో కాంగ్రెస్ అనుసరించే అస్పష్ట వైఖరి, వ్యూహ వైఫల్యాలూ కారణమే! ఇదంతా బిజెపికి, అది నేతృత్వం వహించే ఎన్‌డిఎకి పరోక్షంగా మేలు చేస్తోంది. 'మా స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీయే' అనే కొందరు బిజెపి నేతల వ్యంగ్య వ్యాఖ్యల్లోని 'హాస్యం' కన్నా వాస్తవికతే జనాల్ని ఎక్కువ ఆలోచింపజేస్తోంది. రాహుల్ గాంధీ రాజకీయ ప్రగతి సూచీ స్థిరంగా ఉండకపోవడానికి ఆయన ప్రాధాన్యతలు, ప్రవర్తనే కారణమని మేధావులు, రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తారు. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఎక్కువ జనాదరణతో ఉన్నారు. 2019 ఎన్నికల ముందరితో పోల్చి చూస్తే, 2024 ముందర పలు సర్వేల జనాదరణలో ప్రధాని అభ్యర్థిగా మోడీకి కొంత సమీపంలోకి రాహుల్ రాగలిగారు. అప్పటికి దేశాన్ని చుట్టేస్తూ ఆయన అడ్డంగా, పొడువుగా రెండు పాదయాత్రలు చేసి ఉన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా ఎండగడుతూ పార్లమెంటులో చక్కని, ప్రభావవంతమైన ప్రసంగాలు చేస్తున్నారు. ప్రధాని మోడీకి, పారిశ్రామికవేత్త అదానీకి వీడదీయరాని బంధముందని చేసిన పార్లమెంట్ ప్రసంగం ఆకట్టుకుంది. కానీ, ఆ స్థిరత్వం 2024 ఎన్నికల తర్వాత కొనసాగలేదు. మారిన రాజకీయాల్లో నాయకుల అటెన్షన్ 24/7 గంటలు ప్రజలు ఆశిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రక్రియ నుంచి రాహుల్ తరచూ 'సెలవుల'పై వెళ్లడాన్ని జనం వింతగా చూస్తున్నారు. 'ఇతనికి సీరియస్‌నెస్ లేదు' అనే వ్యాఖ్య జనంలో తరచూ వినిపిస్తోంది. భారత్‌లో పరిస్థితుల్ని ఎత్తిచూపుతూ విదేశాల్లో చేసిన విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన పలుకుబడిని, నిబద్ధతని కొంత ఇరకాటంలో పెట్టాయి. ఆ క్రమంలో కిందకు జారిపోయిన రాహుల్ 'ఇమేజ్ గ్రాఫ్' ఇటీవల మళ్లీ ఊర్ధ్వముఖంగా సాగుతోంది. పాలక ఎన్‌డిఎ ఎదుర్కొన్న కొన్ని విపరిణామాలు, 'పేపర్ లీక్, 'చందాచోర్' 'జిడిపి గ్రోత్ రేట్ వివాదం' వంటి వాటిపై ప్రతికూలంగా వచ్చిన విస్తృత ప్రజాభిప్రాయం బిజెపిని ఇరుకున పెట్టడమే కాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల విమర్శలకు కొంత వెయిటేజీ పెంచింది.. ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఎంతో దన్నుగా ఉండి, కాలక్రమంలో, ముఖ్యంగా 2014 తర్వాత క్రమంగా దూరమైన దళితవర్గాల్ని పూర్తిగా తమవైపు తిప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. 'దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీ అధినేత (మల్లికార్జున్ ఖర్గే) కే ఈ గతిపడితే, ఇక దేశంలో సామాన్య దళితుల సంగతేమిటి?' అని రాహుల్ ప్రశ్నిస్తున్నారు. ఖర్గే పాల్గొన్న సభా వేదికను 'శుద్ధీకరణ' పేరిట ప్రక్షాళన చేసిన 'బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, దళిత వ్యతిరేక భావజాలం' అంతా ఒకటే అని ఆయన ప్రచారం



చేస్తున్నారు. ఆ వరుసలోనే, మహిళా బిల్లు కంటితుడుపు చర్య చేసి, అమలును నిర్లక్ష్యం చేస్తున్న ఎన్‌డిఎది పురుషాధిక్య 'మనుస్మృతి' భావజాలమని, వారు మహిళల రిజర్వేషన్ అమలు చేయరనే వాదనను ఆయన జనంలోకి తెస్తున్నారు. 'ఛాత్రోంకీ గూంజ్' విద్యార్థులు, యువజనుల సదస్సులకు హాజరై బిగ్గరగా వారి అనుకూల స్వరం వినిపించడం ద్వారా జన్-జీ. జన్- ఆల్ఫాను ఆకట్టుకునే ప్రయత్నం రాహుల్ చేస్తున్నారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు దూరమైన యువతను, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఆకట్టుకుని, తమవైపు తిప్పుకునే వ్యూహంలో భాగమిది. తమ ఒత్తిడిపై దేశంలో కులగణనకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధపడినా, ఒబిసిలకు న్యాయం చేయటం లేదనే విమర్శను కాంగ్రెస్ నాయకత్వం ఎత్తుకుంది. ఒబిసిలకు తాము అనుకూలమంటూ బిజెపి చేసుకునే ప్రచారం ఉత్తిదేనని, కులగణనలో ఎస్‌సి, ఎస్‌టిల మాదిరి బిసిలకు ప్రత్యేకంగా కాలమ్ పొందుపరచకపోవడాన్ని రాహుల్ తప్పుబడుతున్నారు. టిఎంసి, ఎన్‌సిపి, డిఎంకె, ఆప్.. తదితర పక్షాలతో, వివిధ రాష్ట్రాల్లో ఇది పలు సందర్భాల్లో రుజువయింది. సానుకూల వాతావరణంలో కూడా ప్రతికూల ఎన్నికల ఫలితాలకు ఈ సఖ్యత కొరవడటమే కారణం. ఇక ముఖ్యమైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాద్ (ఎస్‌పి) తో కాంగ్రెస్ సఖ్యత ఎలా ఉంటుంది? అన్నది కీలకం. 2029 సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందర అసెంబ్లీ ఎన్నికలు (ఫిబ్రవరి -2027) జరగాల్సిన యుపి ఏ రకంగా చూసినా ఇండియా కూటమికి ముఖ్యమైందే! 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్ఫి (36.6% ఓటు వాటా), కాంగ్రెస్ నేతృత్వపు యుపిఎ (2.33% ఓటు వాటా) విడివిడిగా పోటీ చేసి దెబ్బతిన్నాయి. 2024 లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఇండియా కూటమి, ఎస్‌పి 37, కాంగ్రెస్ 6, మొత్తం 43 ఎంపి స్థానాల (43.52% ఓటు వాటా) తో లబ్ధి పొందింది. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి వైఖరి అనుసరించనున్నారు? అన్నది కీలకం. ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ పలు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. పిచ్‌డే- దళిత్-అల్పసంఖ్యాక్/ పిడిఎ వ్యూహం ఆయన చేతిలో అస్త్రంగా ఉంది. బలహీనవర్గాలు (పిచ్‌డే)కు తోడు 'పి' అంటే 'పండిట్' కూడా అని ఇటీవలే ఒక సభలో వివరణ ఇచ్చిన అఖిలేశ్, బ్రాహ్మణ వర్గానికి చేరువ కావాలని చూస్తున్నారు. హిందుత్వ వాదనకు ఎస్‌పి వ్యతిరేకం కాదనే భావన వచ్చేలా.. 'సనాతన ధర్మం' ఈ దేశంలో ఐక్యత సాధించిందని కితాబిచ్చారు. ఒక వేదిక నుంచి 'హనుమాన్ చాలీసా' చదివారు. 'ఇటావా' నియోజకవర్గ పరిధిలో అఖిలేష్ చైర్మన్‌గా ఉన్న ఒక ట్రస్ట్ నిర్మిస్తున్న కేదారేశ్వర్ ఆలయం 2027 ఎన్నికలకు ముందరే ప్రారంభం కానుంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వల్లెవేస్తున్న 'మనుస్మృతి' కాంగ్రెస్ అనుసరించే 'హిందూ వ్యతిరేక' వైఖరికి నిదర్శనమని చెప్పేందుకు బిజెపి ప్రచారాస్త్రమవుతుందా? యుపిలో ఇది అఖిలేశ్‌తో పొసగని పొత్తు వ్యూహమవుతుందా? కాంగ్రెస్ కొంచెం ఆలోచించుకోవాలి!.

బ్రిటన్‌లో వేర్పాటు భేరి!

బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్‌ల వేటకు తోడ్పడ్డాయి. కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవహక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి. బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించా లనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు. మనతో సహా అనేక దేశాలను పీల్చిపిప్పిచేసిన బ్రిటన్ ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకోగలదా అన్నది వేచిచూడాలి.

పోలీసులు మూల్యం చెల్లించుకోక తప్పదు

విజయవాడ ,ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని

రచ్చకెక్కిన వైసీపీ పాలిటిక్స్

శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీలో తీవ్ర కలకలం రేపాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ సొంత పార్టీ నాయకులపై సంచలన వ్యాఖ్యలు చేయడం శ్రీకాకుళం జిల్లా వైసీపీ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. తమ్మినేని సీతారాం రాజకీయ జీవితానికి ముగింపు ఉండదని, కేవలం విరామాలు మాత్రమే ఉంటాయని వ్యాఖ్యానించిన ఆయన, జిల్లా పార్టీ అధ్యక్షుడి పనితీరుపై నిప్పులు చెరిగారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ తమ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. తమ్మినేని సీతారాంకు, టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మధ్య రహస్య రాజకీయ ఒప్పందం ఉందంటూ వైసీపీ నేతలే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ధర్మాన సోదరులు, కుంభ రవిబాబు, భూడి ముత్యాల నాయుడు వంటి ముఖ్య నేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. సీతారాం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఏనాడూ వివక్ష చూపలేదని, కానీ ఇప్పుడు జిల్లాలో ఒకే కులం ప్రాబల్యాన్ని పెంచేలా పార్టీ సాగుతోందనే చర్చ జరుగుతోందన్నారు. ఆమదాలవలస ఇన్ఛార్జ్ చింతాడ రవి అభ్యర్థిత్వంపై నాయకుల్లో అభద్రత ఉందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాదని, కావాలంటే పార్టీ సర్వే నివేదికలను పరిశీలించుకోవచ్చని సైతం సంచలన వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో పార్టీ సీనియర్ నాయకుల తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ వైఖరితో పార్టీకి ఏ ప్రయోజనం లేదన్నారు. ఆమదాలవలసలోని తమ నివాసంలో మీడియాతో మాట్లాడిన చిరంజీవి నాగ్.. శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్ వైఖరి సరిగ్గా లేదని విమర్శించారు. పార్టీకి పెద్దదిక్కుగా చెప్పుకొనే ధర్మాన ప్రసాదరావు తీవ్ర అభద్రతాభావంతో రాజకీయాలు చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా పరిశీలకుడు బూడి ముత్యాలనాయుడి బాధ్యతలపై ప్రశ్నిస్తూ, స్థానిక ఎన్నికల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను వేదికపై ఉన్న సీనియర్ నాయకులు ఎవరూ ఖండించకపోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. సెప్టెంబర్ 12న త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించింది. చింతాడ రవి అరెస్టును రాజకీయ పరిణామంగా అభివర్ణించి, తమ్మినేని సీతారాం అరెస్టు కాకపోవడానికి బంధుత్వాలే కారణమని గొర్లె కిరణ్ మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. జిల్లా పరిశీలకుడు బూడి ముత్యాలనాయుడు, పార్లమెంట్ పార్టీ పరిశీలకులు అయిన కుంబ రవి, సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావులు గొర్లె కిరణ్ కుమార్ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించడంలో ధర్మాన కృష్ణదాస్ విఫలమయ్యారని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలను అడ్డుకోలేకపోయారని విమర్శించారు. కేవలం ఒక కులాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయాలు చేయాలనుకుంటే ఆ విషయాన్ని నేరుగా పార్టీ అధిష్ఠానానికి స్పష్టం చేయాలని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాల్లో వైసీపీ ఒక్క సీటూ గెలవదని తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి.

కూటమి లోపాలే...వైసీపీకి వరాలా

విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికలు అధికార కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు పెద్ద సవాలుగా మారతాయని ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ అంచనా వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల పరిధిలో సీట్ల సర్దుబాటు ఒక ఎత్తయితే.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే వేలాది వార్డులు, పంచాయతీలు, జడ్పీటీసీ స్థానాల్లో స్థానిక నాయకుల ఆశలను సమన్వయం చేయడం అసాధ్యమని జగన్మోహన్ రెడ్డి భావించారు. ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ మూడు పార్టీల నుంచి ఆశావహులు పోటీపడటం వల్ల కూటమిలో అంతర్గత కుమ్ములాటలు వచ్చి, తమకు రాజకీయంగా పెద్దపీట దక్కుతుందని వైఎస్ఆర్‌సీపీ ఆశించింది. అయితే, ఈ ప్రతిపక్ష వ్యూహాన్ని కూటమి అగ్రనాయకత్వం ముందే పసిగట్టి చురుగ్గా అడుగులు వేస్తోంది. గ్రామ స్థాయి నుంచి అసంతృప్తులు రేగకుండా కూటమి పెద్దలు పవర్ షేరింగ్, కో-ఆర్డినేషన్ సూత్రాన్ని అమల్లోకి తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన 80:15:5 ఫార్ములాను లేదా స్థానిక బలాబలాల ఆధారంగా సీట్ల పెంపకాన్ని స్పష్టమైన రూట్ మ్యాప్‌తో పరిష్కరించాలని నిర్ణయించారు. పంచాయతీ లేదా వార్డు స్థాయిలో ఏ పార్టీకి బలం ఉంటే అక్కడ ఆ పార్టీ అభ్యర్థికి మిగిలిన రెండు పార్టీలు మద్దతు తెలిపేలా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్ఠానం నిరంతరం సమాచార మార్పిడి చేసుకుంటూ, క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. వైఎస్ఆర్‌సీపీ వ్యూహం వెనుక మరో బలమైన కారణం ఉంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీలో టికెట్లు దక్కని ఆశావహులు తిరుగుబాటు చేయడం సహజం. ఈసారి కూటమిలో మూడు పార్టీలు ఉన్నందున ఆ తిరుగుబాటు ముమ్మరమై, ఓట్లు చీలిపోయి తమకు కలిసివస్తుందని జగన్ వర్గం భావించింది. కానీ, కూటమి నాయకత్వం తిరుగుబాటు అభ్యర్థులకు నామినేటెడ్ పదవులు, సొసైటీ బోర్డులు, స్థానిక కమిటీలలో అవకాశాలు కల్పిస్తామని ముందస్తు భరోసా ఇస్తోంది. దీంతో టికెట్ దక్కని నాయకులు కూడా పార్టీ గీత దాటకుండా సర్దుకుపోయేలా కార్యాచరణ సిద్ధమైంది. వైఎస్ఆర్‌సీపీ ఇప్పటివరకు వైఫల్యాలను ఎండగడుతూ కూటమిపై వ్యతిరేకత పెరిగిందని ప్రచారం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పార్టీకి గట్టి అభ్యర్థులను నిలబెట్టడమే పెద్ద సవాలుగా మారింది. 2024 ఎన్నికల ఓటమి తర్వాత గ్రామ స్థాయిలో క్యాడర్ తీవ్ర నిరాశలో ఉంది. ఈ బలహీనతను కప్పిపుచ్చుకోవడానికి కూటమిలో చీలికలు వస్తాయని జగన్ ఆశించినా, కూటమి నాయకత్వం మాత్రం ఒకే వేదికపైకి వచ్చి ఐక్యతా రాగం వినిపిస్తోంది. స్థానిక పోరులో కూడా ఏకీకృత ప్రచారం నిర్వహించేందుకు రోడ్‌మ్యాప్ తయారు చేసేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి కూలిపోతుందన్న ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఆశలపై కూటమి పెద్దలు పక్కా వ్యూహంతో నీళ్లు చల్లారు. క్షేత్రస్థాయి సమీకరణాలను ముందే బేరీజు వేసుకుంటూ, ఆశావహులను బుజ్జగిస్తూ, పవర్ షేరింగ్ నెరవేరుస్తూ ముందుకు సాగుతుండటంతో వైఎస్ఆర్‌సీపీ ఆశించిన కూటమి కుమ్ములాటల అడ్వాంటేజ్ దక్కేలా కనిపించడం లేదు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి తమ పొత్తు బంధం కేవలం ఎన్నికలకే పరిమితం కాదని నిరూపించడానికి కూటమి పక్షాలు సిద్ధమవుతున్నాయి.

సుప్రీంకోర్టులో మరోసారి ఓటుకు నోటు కేసు విచారణ

హైదరాబాద్,సుప్రీంకోర్టు లో ఓటుకు నోటు కేసు విచారణ జరిగింది. తమపై నమోదైన కేసు కొట్టివేయాలని రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టును కోరిన విషయం తెలిసిందే. సీనియర్ లాయర్ సిద్ధార్థ్ లూథ్రా రేవంత్ రెడ్డి తరఫున వాదనలు వినిపించారు. 2015లో జరిగిన ఘటనకు 2018లో సవరించిన అవినీతి నిరోధక చట్టం వర్తించదని సుప్రీంకోర్టుకు రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది తెలిపారు. అయితే ఓటు అనేది చట్టబద్ధమైన హక్కు అని, దానిని ప్రభావితం చేసినప్పుడు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుందని న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేసారు. తదుపరి విచారణలో బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదనలు వింటామని కేసును సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

తెలుగు రాష్ట్రాల్లో ఆశీర్వాద దీపాలు

అమరావతి,కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. వేల కోట్ల నిధులను మంజూరు చేసినందున.. ఆ ప్రాజెక్టుల వద్ద ఆశీర్వాద దీపం పేరిట భారీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విభజన హామీలతో పాటు ఏపీకి కీలకమైన ప్రధాన ప్రాజెక్టులకు కేంద్రం న భూతో న భవిష్యత్ అన్నట్లుగా నిధులు కేటాయించినందుకు గాను, రాష్ట్ర ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇళ్ల వద్ద, ప్రధాన ప్రాజెక్టు ప్రాంతాల్లో ఈ దీపాలను వెలిగించనున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేసిన 15 ప్రధాన ప్రాంతాలు, మౌలిక సదుపాయాల వద్ద ఈ ఆశీర్వాద దీపాల కార్యక్రమం అత్యంత ఘనంగా జరగనుంది. అమరావతి రాజధాని నిర్మాణం, కొండవీడు పర్యాటక అభివృద్ధి, విజయవాడ కనకదుర్గ ఫ్లైఓవర్, జాతీయ రహదారి ఔఊ-16 విస్తరణ, తిరుమల?తిరుపతి యాత్రికుల సదుపాయాలు మరియు మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం పోర్టుల అభివృద్ధి ప్రాంతాల్లో ప్రత్యేక దీపోత్సవాలు నిర్వహించనున్నారు. అలాగే విద్యా, వైద్య రరంగాల్లో వెలుగులు నింపిన మంగళగిరి ఎయిమ్స్ , ఐఐటీ తిరుపతి, ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లతో పాటు విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల వద్ద కూడా ఈ కార్యక్రమం ప్రతిధ్వనించనుంది.రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు కేంద్రం రూ. వేల కోట్ల నిధులు మంజూరు చేసి నిర్మాణం వేగవంతం చేయడమే కాకుండా, రాజధాని అమరావతి మౌలిక సదుపాయాల కల్పనకు వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో కేంద్రం అందించిన రూ. 15,000 కోట్ల భారీ ఆర్థిక సాయానికి కృతజ్ఞతగా ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న బలమైన అనుబంధం వల్లనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలోకి వచ్చిందని, ఈ నిధుల ప్రవాహం ఏపీ భవిష్యత్తును మారుస్తుందని పారిశ్రామిక, సామాజిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఆయా ప్రాజెక్టుల ప్రాంగణాల్లో స్వయంగా పాల్గొని ఆశీర్వాద దీపాలను వెలిగించనున్నారు. వీరితో పాటు వివిధ రంగానికి చెందిన ప్రముఖులు, విద్యార్థులు, పర్యాటకులు, వేలాది మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ప్రధాని మోదీ పుట్టిన రోజుకు ఈ ఆశీర్వాద దీపం' కార్యక్రమం కేవలం ఒక కృతజ్ఞతా పూర్వక వేడుక మాత్రమే కాకుండా, డబుల్ ఇంజిన్ సర్కార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న మౌలిక వృద్ధికి అద్దం పడుతోంది. విద్య, వైద్యం, లాజిస్టిక్స్, రవాణా, పర్యాటకం, వ్యవసాయ రంగాల్లో కేంద్ర నిధులతో వచ్చిన ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడనుంది.

జలాధివాసమైన 5 వారాలకే 'సంగమేశ్వర' శిఖర దర్శనం

కర్నూలు, సంగమేశ్వరాలయ శిఖరం బయటపడటంతో.. ఆలయ పూజారులు జెండా కట్టి పూజలు చేశారు. ఆగస్టు 6వ తేదీ సంగమేశ్వరాలయం జలాధివాసమైంది. అయితే, నెల రోజుల తర్వాత ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఇరవై మూడేళ్ల కాలంలో ఈసారి తక్కువగా ఐదు వారాల వ్యవధిలోనే శిఖరం కనిపించడం గమనార్హం. శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 864 అడుగులకు చేరింది. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను నల్లమల సాగర్ జలాశయానికి తరలించడంతో సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటకు వచ్చింది.కృష్ణా నదికి వరద నీరు చేరినప్పుడు పూర్తిగా జలాధివాసమయ్యే నంద్యాల జిల్లాలోని సంగమేశ్వరాలయం.. మళ్లీ వేసవిలోనే బయటకు వస్తుంది. కానీ, ఈ ఏడాది జలాధివాసమైన కొద్ది రోజుల్లోనే దర్శనమివ్వనుంది. ఆగస్టు 6వ తేదీ సంగమేశ్వరాలయం జలాధివాసమైన సంగతి తెలిసిందే. అయితే, నెల రోజుల తర్వాత ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఎగువ నుంచి ప్రవాహాలు లేకపోవడం, శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కారణంగా ఆలయ శిఖరం దర్శనమిచ్చినట్లు ఆలయ పురోహితులు చెబుతున్నారుసంగమేశ్వరాలయ శిఖరం బయటపడటంతో.. ఆలయ పూజారులు జెండా కట్టి పూజలు చేశారు. జలాధివాసం అయ్యాక సాధారణంగా ఐదారు నెలలకు, అంటే వేసవి ప్రారంభంలోనే గానీ ఆలయ శిఖరం కనిపించదు. కానీ ఇప్పుడు నెల రోజుల్లోనే మళ్లీ ఆలయ శిఖరం దర్శనమిచ్చిందని పూజారులు చెబుతున్నారు. ఇరవై మూడేళ్ల కాలంలో ఈసారి తక్కువగా ఐదు వారాల వ్యవధిలోనే శిఖరం కనిపించడం గమనార్హం.శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 864 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జలాశయం పూర్తిగా నిండకపోవడం, తెలంగాణ వైపు విద్యుదుత్పత్తి చేయడం, ఏపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను నల్లమల సాగర్ జలాశయానికి తరలిస్తుండటంతో సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటకు వచ్చింది.ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు లేనప్పటికీ ఎగువన కురిసిన భారీ వర్షాలకు కృష్ణా నదికి వరదలు రావడంతో ఆ నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. దాంతో శ్రీశైలం జలాశయం నీటితో కళకళలాడింది. ఫలితంగా సంగమేశ్వర ఆలయం పూర్తిగా జలాధివాసం అయింది. జలాధివాసం సందర్భంగా పురోహితులు, ఆలయ అర్చకులు గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో చీర, సారె సమర్పించారు. అయితే, తిరిగి ఇప్పుడు శిఖర దర్శనం కావడంతో జెండా కట్టారు.గతేడాది జూన్ 15వ తేదీన సంగమేశ్వం స్వామి గర్భాలయంలోకి నీరు ప్రవేశించగా.. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీన నీరు చేరింది. గతేడాది జూన్ 15న స్వామివారు జలాధివాసం కాగా.. మార్చిలో నీరు తగ్గి ఆలయం బయటపడింది. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ఆలయం జలాధివాసం కాగా.. కేవలం ఐదు వారాల్లోనే ఆలయ శిఖరం కనిపించడం గమనార్హం.మార్చి నెలలో కనిపించాల్సిన సంగమేశ్వర ఆలయ శిఖరం.. వర్షాకాలం పూర్తి కాకముందే కనిపించడం ఎల్‌నినో తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పుడే పరిస్థితి ఎలా ఉంటే వేసవిలో పరిస్థితి ఏంటి? ఎల్‌నినో తీవ్రమై వచ్చే వర్షాకాలంలో సరిగా వర్షాలు కురవకపోతే ఎలా ఉంటుందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. జలాధివాసమైన ఐదు వారాలకే సంగమేశ్వర శిఖరం తిరిగి కనిపించడం శివయ్య భక్తులకు ఆనందం కలిగించే విషయమే అయినప్పటికీ.. భవిష్యత్తు సమస్యలకు ఇది ఓ సంకేతం కావచ్చునే భావనా వ్యక్తమవుతోంది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు శ్రీశైలం జలాల వినియోగం విషయంలో క్రమశిక్షణతో వ్యవహరించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు.

సేవ సంకల్ప అభయాన్ కార్యక్రమం

శిరివెళ్ల , స్థానిక ఆసుపత్రి యందు డాక్టర్ ముకేశ్ మరియు డాక్టర్ ఆంజనేయ నాయక్ నేతృత్వంలో సేవా సంకల్ప అభయాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సేవా సంకల్ప కార్యక్రమం రూపుదిద్దుకున్నదని,సమాజంలోని అభాగ్యులకు చేయూత నిందిస్తూ ప్రజలకుఆరోగ్య పరిరక్షణ ,విద్యార్థులకు చేయూత, మహిళా సాధికారికత పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు ఈనెల 17 నుండి నెలరోజుల పాటు నిర్వహిస్తారని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం అని తెలిపారు.తదనంతరము సిబ్బందిచే సేవా సంకల్ప కార్యక్రమం పై తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఎంటర్ ద డ్రాగన్ ..హూతీస్ స్పీడ్ బ్రేక్

దుబాయ్,ఇరాన్‌కు అత్యంత సన్నిహిత మిత్రదేశంగా ఉన్న చైనా.. ఇప్పుడు టెహ్రాన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తోంది. యెమెన్‌లోని హూతీలను కట్టడి చేయాలని ఇరాన్‌ను బీజింగ్ కోరినట్లు ముగ్గురు ఇరాన్ వర్గాల ప్రతినిధులు వెల్లడించారు. గత వారం రోజులుగా ఎర్ర సముద్ర తీర ప్రాంతంతోపాటు కీలకమైన బాబ్ ఎల్ మండెబ్ జలసంధి పరిసరాల్లో హూతీలు వేగంగా దూసుకెళ్లడంతో సౌదీ అరేబియా చైనాను ఆశ్రయించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం.హూతీల దూకుడుతో సౌదీ చమురు ఎగుమతులు, అంతర్జాతీయ నౌకాయానం మరింత ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది. దీంతో రియాద్ బీజింగ్ సాయం కోరినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి.

తెరవెనుక మరో మాట!

ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గాలని.. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని.. సముద్ర మార్గాల్లో సురక్షిత నావిగేషన్ పునరుద్ధరించాలని చైనా ఇప్పటికే బహిరంగంగా పిలుపునిచ్చింది. అయితే ఇరాన్‌కు పంపిన ప్రైవేటు సందేశం మాత్రం మరింత స్పష్టంగా ఉన్నట్లు ఆ దేశ వర్గాలు చెబుతున్నాయి. హోతీలపై ఇరాన్‌కు ఉన్న ప్రభావాన్ని ఉపయోగించి వారిని అదుపులో ఉంచాలని చైనా కోరినట్లు సమాచారం. ముఖ్యంగా ఎనర్జీ సరఫరాలకు కీలకమైన సముద్ర మార్గాల్లో యుద్ధం మరింత విస్తరించకుండా చూడాలని బీజింగ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ సందేశాన్ని చైనా ఏ మార్గంలో పంపిందన్నది స్పష్టంగా తెలియలేదు. బుధవారం చైనా పర్యటనకు వెళ్లిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చితో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిందా? అన్నదీ తెలియరాలేదు.చైనా మాత్రం ఇరాన్‌పై ఎలాంటి ఆర్థిక ఆంక్షలు లేదా ఇతర ఒత్తిళ్లు పెంచుతామని హెచ్చరించలేదని ఇరాన్ వర్గాలు పేర్కొన్నాయి.

'యెమెన్, ఎర్ర సముద్రానికి విస్తరించొద్దు'

చైనా విదేశాంగ శాఖ ఈ అంశంపై స్పందిస్తూ.. యెమెన్, ఎర్ర సముద్ర ప్రాంతాలకు సంక్షోభం మరింత విస్తరించడం తమకు ఇష్టం లేదని స్పష్టం చేసింది. ప్రాంతీయ అస్థిరత పెరగడం ఏ పక్షానికీ ప్రయోజనం కాదని తెలిపింది.అన్ని దేశాల సార్వభౌమత్వం, భద్రతను గౌరవించాలని.. ప్రజల జీవనానికి కీలకమైన మౌలిక వసతులపై దాడులు జరగకూడదని చైనా పేర్కొంది. పరిస్థితిని మరింత క్లిష్టం చేసే చర్యలకు స్వస్తి పలికి, చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది.

ఇరాన్ చమురే కీలకం

ఇరాన్‌కు చైనా పదేళ్లకు పైగా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. ముఖ్యంగా ఇరాన్ చమురుకు చైనానే ప్రధాన కొనుగోలుదారు. 2025లో ఇరాన్ సముద్ర మార్గం ద్వారా ఎగుమతి చేసిన చమురులో 80 శాతానికి పైగా చైనానే కొనుగోలు చేసినట్లు కెప్లర్ గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు సగటున సుమారు 14 లక్షల బ్యారెళ్ల ఇరాన్ చమురు చైనాకు చేరినట్లు అంచనా. అందుకే ఇరాన్‌పై ప్రభావం చూపగల అతికొద్ది దేశాల్లో చైనా ఒకటని పశ్చిమ దేశాలకు చెందిన ఓ సీనియర్ దౌత్యవేత్త వ్యాఖ్యానించారు.

ఇప్పుడు ఎర్ర సముద్రానికీ ముప్పు!

ఇప్పటికే హోర్ముజ్ జలసంధి దాదాపుగా మూసుకుపోయిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో హూతీలు ఎర్ర సముద్రంలో నౌకలు, పోర్టులపై నిరంతర దాడులకు దిగితే ప్రపంచ ఇంధన సంక్షోభం మరింత ముదిరే ప్రమాదం ఉంది.ఎందుకంటే ప్రపంచంలోని రెండు కీలక చమురు ఎగుమతి మార్గాలు ఒకేసారి ప్రభావితమవుతాయి. ఒకవైపు హోర్ముజ్.. మరోవైపు ఎర్ర సముద్రం-బాబ్ ఎల్ మండెబ్. రెండు మార్గాల్లోనూ రవాణా దెబ్బతింటే చమురు సరఫరాలు,

అంతర్జాతీయ వాణిజ్యంపై భారీ ప్రభావం పడే అవకాశం ఉంది.ఇరాన్, దాని మిత్ర బలగాలు ఈ కీలక సముద్ర మార్గానికి రెండు వైపులా ఒత్తిడి పెంచుతున్నాయని ఓ వర్గం పేర్కొంది. అయితే "చైనాకు ఈ రెండు మార్గాలూ అవసరమే" అన్నది కీలక అంశం.

మధ్యప్రాచ్య చమురుపైనే ఆధారం

వాషింగ్టన్‌లోని మిడిల్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అలెక్స్ వటాంకా ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా ఒత్తిడిని చైనా వ్యతిరేకించవచ్చు. కానీ మధ్యప్రాచ్యంలో బీజింగ్ ప్రయోజనాలు ఇరాన్‌తో మాత్రమే పరిమితం కావు. చైనా దిగుమతి చేసుకునే చమురులో సుమారు సగం మధ్యప్రాచ్యం నుంచే వస్తోంది. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాలతో చైనా వార్షిక వాణిజ్యం సుమారు 300 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది."హోర్ముజ్‌ను ఇరాన్ అడ్డుకోగలదు. కానీ ఒక దశ తర్వాత అదే పట్టు.. ఇరాన్ ఎక్కువగా ఆధారపడుతున్న చైనాకే నష్టం చేయడం ప్రారంభిస్తుంది" అని వటాంకా విశ్లేషించారు.

ఈ మాట ఇరాన్ వింటుందా?

అసలు ప్రశ్న ఇప్పుడు ఇదే. బీజింగ్ ఆందోళనలను టెహ్రాన్ ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటుందన్నది ఇంకా స్పష్టంగా లేదు. అమెరికాతో ఘర్షణ కొనసాగుతున్న వేళ చైనాతో ఇరాన్‌కు ఉన్న ఆర్థిక, వ్యూహాత్మక బంధం మాత్రం అత్యంత కీలకం. యుద్ధం, ఆంక్షలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు పెట్టుబడులు, చమురు పరిశ్రమకు అవసరమైన ఆర్థిక సహకారం అందించగల దేశాల్లో చైనా ముందుంది. అంతేకాదు.. 2023లో ఇరాన్--సౌదీ అరేబియా మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణకు చైనా మధ్యవర్తిత్వం వహించింది. దీంతో ప్రాంతీయ రాజకీయాల్లో బీజింగ్ ప్రభావం ఏ స్థాయిలో ఉందో స్పష్టమైంది.ఈ ప్రభావానికి కూడా పరిమితులున్నాయి. 2021లో కుదిరిన 25 ఏళ్ల సహకార ఒప్పందం తర్వాత ఇరాన్‌లో చైనా చమురేతర పెట్టుబడులు, వాణిజ్యం ఆశించిన స్థాయిలో లేవని ఇరాన్‌లోని కొందరు విమర్శకులు అంటున్నారు. ఇదే సమయంలో గల్ఫ్ అరబ్ దేశాల్లో చైనా పెట్టుబడి హామీలు పెరుగుతున్నాయి.

టెహ్రాన్‌కు తప్పని చైనా

చైనాను ఇరాన్ పూర్తిగా విస్మరించలేని పరిస్థితి.. ఇరాన్‌ను చైనా కూడా పూర్తిగా పక్కన పెట్టలేని పరిస్థితి. హోర్ముజ్ తిరిగి తెరుచుకోవాలని.. ఎర్ర సముద్రంలో నౌకాయానం సురక్షితంగా సాగాలని బీజింగ్ కోరుతోంది.చైనా తన మాటను ఇరాన్ వినేలా చేయడానికి ఎంతవరకు ప్రభావాన్ని ఉపయోగిస్తుంది? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న. హూతీలను కట్టడి చేయాలన్న డిమాండ్‌కు అనుగుణంగా టెహ్రాన్‌పై బీజింగ్ నిజంగా ఏదైనా ఒత్తిడి పెంచుతుందా? అన్నదే చైనా వైఖరికి అసలు పరీక్షగా మారనుంది.

7289 డాక్యుమెంట్ ఎలా వచ్చింది?

సిరిసిల్ల, బొల్లి రామ్మోహన్‌కు సంబంధించిన భూముల వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావించిన 7289 డాక్యుమెంట్ నంబర్‌పై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కేటీఆర్ పేర్కొన్న 12-12-2007 తేదీ, 7289 డాక్యుమెంట్ నంబర్‌పై అనేక సందేహాలు ఉన్నాయని, అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరగా, 2007 డిసెంబర్ 31 నాటికి ఆ ఏడాది నమోదైన చివరి బుక్ డాక్యుమెంట్ నంబర్ 5777 అని కార్యాలయం తెలిపిందన్నారు.అదే ఏడాది 12-12-2007 తేదీతో 7289 నంబర్ డాక్యుమెంట్ ఎలా వచ్చిందనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని ఆది శ్రీనివాస్ కోరారు. కేటీఆర్ స్వయంగా 7289 నంబర్ డాక్యుమెంట్‌ను ప్రస్తావించడంతో పాటు, దానిని బొల్లి రామ్మోహన్ తనకు పంపించారని చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. డాక్యుమెంట్ నిజమైనదా, కాదా అనే విషయాన్ని రిజిస్టర్ బుక్, ఇండెక్స్, స్కాన్ రికార్డులు, రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి తేల్చాలని కోరారు.

ప్రభుత్వ భూములపై విచారణ కోరిన విప్

బొల్లి రామ్మోహన్‌కు సంబంధించిన సుమారు 2 ఎకరాల 30 గుంటలు, మరో 5 ఎకరాల భూములకు సంబంధించి ప్రభుత్వ భూమి అంశం ఉందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ అయితే ఏ పత్రాల ఆధారంగా జరిగిందో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. కొండూరు రవీందర్‌రావు పేరుతో సుమారు 14 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తాము పేర్కొంటున్నామని, ఈ అంశాన్ని రికార్డుల ఆధారంగా పరిశీలించాలని అన్నారు. భూమి ప్రభుత్వానిదిగా నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుని అర్హులైన పేదలకు అందించాలని కోరారు. తోట ఆగయ్య భూమికి సంబంధించిన పాత రికార్డులు, కేటాయింపు ఉత్తర్వులు, ప్రస్తుత హక్కులు, భూమి స్వభావాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.భూముల వ్యవహారంపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు బదులు అధికారిక రికార్డులను పరిశీలించాలని ఆది శ్రీనివాస్ అన్నారు. 7289 డాక్యుమెంట్‌పై తాము అనుమానాలు మాత్రమే వ్యక్తం చేస్తున్నామని, అది నిజమైనదా లేదా నకిలీదా అనేది సంబంధిత అధికారులు తేల్చాలని పేర్కొన్నారు. డాక్యుమెంట్ తేదీ, నంబర్, రిజిస్టర్ బుక్, పేజీ నంబర్, ఇండెక్స్, స్కాన్ రికార్డులతో పాటు పహాణీ, ధరణి, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. పత్రాలు నకిలీవని నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, డాక్యుమెంట్ చెల్లుబాటు అవుతుందని తేలితే ఆ విషయాన్ని కూడా ప్రజలకు అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. 7289 నంబర్ డాక్యుమెంట్‌పై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఇచ్చిన సమాచారం, కేటీఆర్ పేర్కొన్న వివరాల మధ్య ఉన్న వ్యత్యాసంపై కేటీఆర్ స్పష్టత ఇవ్వాలని కోరారు. వాస్తవాలను వక్రీకరించే వ్యాఖ్యలు చేసి ఉంటే వాటిని వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, నిషేధిత జాబితాలోని భూములు, ప్రైవేటు వ్యక్తుల పేర్లపై నమోదైన భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

సింహపురి వైసీపీ నేతల కొత్త రాజకీయం

నెల్లూరు,నెల్లూరు జిల్లా రాజకీయాల్లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేతలు రోజుకొకరు చొప్పున ప్రెస్‌మీట్లు పెట్టి అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో, నిధుల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయంటూ ప్రకటనలు చేస్తున్నారు. అయితే, చేతిలో నిజంగా ఒక్క కాగితమైనా ఉంటే సాక్షి టీవీ మొదలుకుని సోషల్ మీడియా వరకు భూతద్దంలో పెట్టి రోజుకు వందల వార్తలు, రీల్స్‌తో హోరెత్తించే వైసీపీ ప్రచార యంత్రాంగం.. ఆధారాలు ఉన్నాయని సొల్లు చెబుతూంటే.. ఎవరూ నమ్మడం లేదు.సాధారణంగా ఏ రాజకీయ నేతపైనైనా అవినీతి ఆరోపణలు చేస్తే ప్రజల్లో కొంతైనా చర్చ జరుగుతుంది. కానీ, మంత్రి నారాయణ విషయానికి వస్తే నెల్లూరు ప్రజల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ ఆరోపణలను విశ్వసించే పరిస్థితి లేదు. నారాయణ విద్యాసంస్థల ద్వారా వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని స్వయంగా నిర్మించిన ఆయన.. రాజకీయాల్లోకి వచ్చి చిల్లర అవినీతికి పాల్పడతారంటే నెల్లూరు నగర ఓటర్లు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఆపదలో ఉన్నవారికి విద్య, వైద్యం, వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించే దాతృత్వ స్వభావం ఆయనదని, ప్రజలకు ఎప్పుడూ ఇచ్చే చేతే తప్ప ఆశించే మనస్తత్వం కాదని నగరంలో బలంగా ఒక ముద్ర ఉంది. అటువంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేతపై బురదజల్లితే అది తిరిగి ఎదురుదెబ్బే కొడుతుందన్న ప్రాథమిక స్పృహ వైసీపీ నాయకత్వానికి కొరవడింది.ఈ ఆరోపణల వెనుక అసలు ఎజెండా రాబోయే నెల్లూరు నగర పాలక సంస్థ సహా జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికలేనని స్పష్టమవుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని స్థానాలను కోల్పోయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న వైసీపీ.. కేడర్‌లో స్థైర్యం నింపేందుకు, ఉనికిని చాటుకునేందుకు నారాయణపై టార్గెట్ ఫిక్స్ చేసుకుంది. నగర ఓటర్లలో నారాయణకు ఉన్న పట్టును, అభివృద్ధి రూపకర్తగా ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీయకపోతే కార్పొరేషన్ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే భయం వైసీపీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

హిందుస్థాన్ కోకాకోలా రూ.1127 కోట్లు పెట్టుబడి

విజయనగరం,ఏపీలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక కమిటీ ఆమోదం తెలిపినట్లు సమాచారం. మొత్తం రూ.1127 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. . రూ.842 కోట్లతో విజయనగరం జిల్లాలో కొత్త యూనిట్ ఏర్పాటు చేయనున్నారు.. అలాగే తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో విస్తరణ కోసం రూ.285 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు.. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రాబోతోంది. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీఎల్) విజయనగరం జిల్లాల్లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది.. అలాగే చిత్తూరు జిల్లాలో ప్రస్తుత యూనిట్‌ను విస్తరించనుంది. రాష్ట్రంలో మొత్తం రూ.1,127 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. దేశంలో అతిపెద్ద బాట్లింగ్ భాగస్వామిగా ఉన్న హెచ్‌సీసీబీల్ దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తెలంగాణ, తమిళాడు, కర్ణాటకలో కూల్‌డ్రింక్‌ల డిమాండ్‌కు తగిన విధంగా ఈ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అందుకే ఏపీలో రెండు యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదించగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక కమిటీ ఆమోదం తెలిపినట్లు సమాచారం.హెచ్‌సీసీబీల్ కోకాకోలా రూ.1,199 కోట్ల పెట్టుబడిని ఆంధ్రప్రదేశ్ నుంచి ఉపసంహరించుకుందని గతంలో వైఎస్సార్‌సీపీ ఆరోపణలు చేసింది.. అధికార కూటమి పార్టీలు ఈ విమర్శలకు కౌంటర్ ఇచ్చాయి. వాస్తవానికి కోకాకోలా కంపెనీలో జరిగిన కొన్ని మార్పుల కారణంగా విస్తరణ ప్రణాళిక వాయిదా పడిందని తెలుస్తోంది. తాజాగా రూ.1,199 కోట్ల పెట్టుబడితో కొత్త యూనిట్ ప్రారంభించడంతో పాటుగా.. మరో యూనిట్‌ను విస్తరించేందుకు సిద్ధమైంది. విజయనగరం జిల్లాలో కొత్త యూనిట్ కోసం రూ.842 కోట్లు.. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో విస్తరణ కోసం రూ.285 కోట్లు పెట్టుబడి పెట్టనుంది.విజయనగరంలోని తయారీ యూనిట్‌లో ఏడాదికి 18 మిలియన్ కేసుల సామర్థ్యంతో మూడు బాట్లింగ్ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. పెద్ద, చిన్న ప్యాక్ సైజులలో కార్బోనేటెడ్ కూల్ డ్రింక్‌ల కోసం రెండు బాట్లింగ్ లైన్లు.. జ్యూస్ లైన్, టెట్రా ప్యాక్‌ల కోసం మరో బాట్లింగ్ లైన్ ఉంటాయి. రెండవ దశలో కంపెనీ ఏడాదికి 12 మిలియన్ కేసుల సామర్థ్యంతో రెండు బాట్లింగ్ లైన్లను ఏర్పాటు చేస్తుంది. చిత్తూరు జిల్లాలో ఒక ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాట్లింగ్ లైన్, రెండు కార్బోనేటెడ్ కూల్ డ్రింక్ బాట్లింగ్ లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే విస్తరించిన ప్లాంట్‌లో కోకా-కోలా, థమ్స్ అప్, స్ప్రైట్, ఫాంటా, లిమ్కా, కిన్లీ వాటర్ ఆరు బ్రాండ్‌లను తయారు చేస్తున్నారు. కొత్తగా విస్తరించనున్న ప్లాంట్ కోసం అదనంగా భూసేకరణ చేయరు.. ప్రస్తుతం ఉన్న ప్లాంట్ ప్రాంగణంలోనే విస్తరించనున్నారు.

వారణాసిలో సేవా సంకల్ప్ అభియాన్

లక్నో ,ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగబద్ధమైన ప్రజా జీవితం గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆధ్యాత్మిక క్షేత్రం వారణాసిలో సేవా సంకల్ప్ అభియాన్ అత్యంత ఘనంగా ప్రారంభమైంది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సాగే ఈ సేవా కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వారణాసి ప్రధాన వేదికగా నిలిచింది. ఈ చారిత్రాత్మక ఘట్టానికి ఎన్డీయే కూటమిలోని అగ్రనాయకులు, కేంద్ర మంత్రులు మరియు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌లతో పాటు బీజేపీ, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సీనియర్ నేతలు కాశీ విశ్వనాథుని ఆలయాన్ని సందర్శించారు. విశ్వనాథునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించిన నేతలు.. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, సేవా సంకల్పంతో దేశాన్ని మరింత ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. అనంతరం లలితా ఘాట్ వద్ద గంగాజలాన్ని స్వీకరించి ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక హవనంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం రుద్రాక్ష ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మోదీ 25 ఏళ్ల పరిపాలనా ప్రస్థానం, అభివృద్ధి సంక్షేమ ఫలాలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ప్రదర్శనను నాయకులు ప్రారంభించి వీక్షించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్‌లు ప్రసంగించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం సాధించిన ఆర్థిక, సాంకేతిక, ఆధ్యాత్మిక రంగాభివృద్ధిని, వికసిత్ భారత్ - 2047 లక్ష్యాన్ని నేతలు కొనియాడారుఈ సేవా సంకల్ప్ అభియాన్‌లో ప్రధాన ఆకర్షణగా కాశీ టూ వాద్‌నగర్ పవిత్ర బైక్ యాత్ర నిలిచింది. ప్రధాని మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్‌ను, ఆయన కర్మభూమి అయిన కాశీతో అనుసంధానిస్తూ సాగే ఈ మోటార్ బైక్ ర్యాలీని రాజ్‌నాథ్ సింగ్, యోగి ఆదిత్యనాథ్, చంద్రబాబు నాయుడు కలసి జెండా ఊపి ప్రారంభించారు. 10 ప్రధాన నదుల పవిత్ర జలాలతో సాగే ఈ యాత్ర ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే కాకుండా, వివిధ రాష్ట్రాల్లో రాత్రిపూట బస చేస్తూ ప్రజలతో నేరుగా మమేకం కానున్నారు.నెల రోజుల పాటు సాగే ఈ అభియాన్ కాలంలో దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ప్రజలు, పార్టీ శ్రేణులు ఆశీర్వాద్ కా దియా పేరుతో దీపోత్సవాలు నిర్వహించనున్నారు. దీంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన విభాగాలు, లఖ్‌పతి దీదీలు, డ్రోన్ దీదీల సన్మానాలు, వృక్షారోపణ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రజా సేవయే పరమావధిగా మోదీ సాగిస్తున్న 25 ఏళ్ల పాలనా పయనానికి ఈ అభియాన్ ఒక మకుటాయమానంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.కాశీ విశ్వనాథుని దివ్య సన్నిధిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అగ్రనేతలందరూ ఒకే వేదికపైకి వచ్చి ఈ సేవా సంకల్ప్ అభియాన్‌ను ప్రారంభించడం జాతీయ రాజకీయాల్లోనూ బహుళ ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ఐక్యతను చాటడమే కాకుండా, వికసిత భారత సాధనలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఒక పెద్ద వేదికగా ఉపయోగపడనుంది.

ఐదు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి దొరికిన కీసర సీఐ, ఎస్సై

మేడ్చల్ ,బుధవారం రాత్రి కీసర చెరువు దగ్గర ఛేజింగ్ జరిగింది. ఎస్సై పరుగులు తీస్తుండగా ఏసీబీ టీం వెంటపడింది. సినీమా ఫక్కిలో సీన్ జరిగింది. ఎమైయిందో అంటు స్థానికులు ఆశ్చర్యపోయారు కీసర ఎస్ఐ, సీఐ . ఐదు లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. రేషన్ బియ్యం కేసులో బెయిల్ కోసం నిందితుల నుండి 10 లక్షలు కీసర సీఐ అంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. కీసర చెరువు వద్ద కారులో 5 లక్షలు లంచం తీసుకుంటుండగా వచ్చిన ఏసీబీ అధికారులను చూసి ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి పరుగులు తీసాడు. ఏసీబీ ఛేజింగ్ చేసి పట్టుకుంది. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి, సీఐ అంజనేయులు ముప్పు తిప్పలు పెట్టారు. రేషన్ బియ్యం కేసులో నిందితుల నుండి గత కొంతకాలంగా లంచం డిమాండ్ చేసి నిందితులతో ఇన్స్పెక్టర్ అంజనేయులు పని చేయించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా బిర్యానీలు, కూల్డ్రింక్స్ తీసుకురావాలని సీఐ

కాంగ్రెస్‌కు రివర్స్ అవుతున్న అతి రాజకీయం!

హైదరాబాద్, రాజకీయాల్లో వ్యూహాత్మక పైచేయి సాధించడం ఎంత కళో, దక్కిన ఆ ఆధిక్యతను పదిలపరుచుకుంటూ నిలబెట్టుకోవడం అంతకంటే పెద్ద పరిపక్వత. ఎదుటి పక్షం వేసే ఎత్తులకు పైఎత్తులు వేసి ఇరుకున పెట్టినప్పుడు వచ్చే మైలేజీని మందాగా మలుచుకోవాలి తప్ప, అత్యుత్సాహంతో అతి చేస్తే అది అంతిమంగా చెట్టుకొట్టి మీదేసుకున్న చందంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌తో సాగిస్తున్న తాజా ఘర్షణల పర్వంలో సరిగ్గా ఇదే జరుగుతోందన్న భావన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ వేదికగా మొదలైన వివాదంలో బీఆర్ఎస్ స్వయంకృతాపరాధంతో ఇరుక్కుపోయి, కాంగ్రెస్‌కు అయాచితంగా భారీ పొలిటికల్ అడ్వాంటేజ్ దక్కినప్పటికీ.. ఆ తర్వాత సాగుతున్న పరిణామాలు ఆ పైచేయిని చేజేతులా పోగొట్టుకునే దిశగా సాగుతున్నాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసినట్లుగా వచ్చిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ చాలా తెలివిగా దళిత ఆత్మగౌరవ పోరాటంగా మలిచింది. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత నేతను అవమానించారంటూ అధికార పక్షం సంధించిన అస్త్రం బీఆర్ఎస్‌ను పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. అసెంబ్లీలో 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, సభలో ఆమోదించిన తీర్మానాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు దండోరా మోగిస్తూ సాగిన నిరసనలతో రాజకీయంగా రావాల్సినంత మైలేజ్ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. అసెంబ్లీ గేట్ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రవర్తించిన తీరు, చొక్కాలు విప్పి చేసిన ఆందోళనలు ప్రజల్లో ఆ పార్టీకి తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారాయి. ఇక్కడితో ఆగి ఉంటే.. నైతికంగా, రాజకీయంగా కాంగ్రెస్ సంపూర్ణ విజయం సాధించి ఉండేది.కానీ, అసలు సమస్య ఇక్కడే మొదలైంది. వచ్చిన రాజకీయ పైచేయిని కాపాడుకోవాల్సింది పోయి.. వ్యవహారాన్ని సాగదీసి తెగేదాకా లాగడమే కాంగ్రెస్ వ్యూహకర్తల అతిపెద్ద వైఫల్యంగా కనిపిస్తోంది. సాధారణంగా సభా ప్రాంగణంలో జరిగే నిరసనలు, వాగ్వాదాలను రాజకీయంగా ఎదుర్కోవాలి లేదా ప్రివిలేజ్ కమిటీలు, చైర్మన్, స్పీకర్ విచారణల పరిధిలో క్రమశిక్షణా చర్యలతో ముగించాలి. కానీ ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయించి, ఇద్దరు ఎమ్మెల్సీలను తెల్లవారుజామునే అరెస్ట్ చేయించడం..కేటీఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నేతలపై , పోలీసులతో ఫిర్యాదులు చేయించి కేసులు బనాయించడం ద్వారా వ్యవహారం అతి రాజకీయ పగ గా మారిపోయింది.ఒక దశ దాటిన తర్వాత చట్టపరమైన అతి దూకుడు ఎప్పుడూ ఎదురుదెబ్బే కొడుతుంది.అసెంబ్లీ ముట్టడి వెనుక పెద్ద కుట్ర ఉందని,పోలీసులను ఉద్దేశపూర్వకంగా కాలర్‌లు పట్టుకుని తోసేశారని కేసులు నమోదు చేసి కోర్టులు, రిమాండ్లు అంటూ ముందుకు వెళ్లడం వల్ల.. సహజంగానే ప్రజాక్షేత్రంలో బాధితులెవరో, వేధిస్తున్నదెవరో అనే సరిహద్దులు చెదిరిపోతాయి. రాజకీయాల్లో ప్రత్యర్థి తప్పు చేసినప్పుడు ఆ తప్పును ఎత్తిచూపి ప్రజా క్షేత్రంలో దోషిగా నిలబెట్టడం వరకే పరిమితం కావాలి. అం తేకానీ, అదే తప్పును సాకుగా తీసుకుని పోలీసు వ్యవస్థను ప్రయోగించి కక్షసా ధింపులకు దిగితే.. ప్రజల్లో ప్రభుత్వ పరిపక్వతపై అనుమానాలు మొదలవు తా యి. తాము సాధించిన దళితవాద ఆధిపత్యాన్ని అరెస్టుల రూపంలో కరిగిపోకు ండా కాపాడుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందన్నది కాదనలేని సత్యం.

డీఎంకే నేతలు మాట్లాడితే కేసులు...విజయ్ మార్క్ !

చెన్నై:తమిళనాడు రాజకీయాలు అసెంబ్లీ రికార్డుల నుంచి పోలీస్ స్టేషన్ల వరకు రగిలిపోతున్నాయి. ప్రతిపక్ష డీఎంకే నేతలు రాజకీయ విమర్శలతో గళమెత్తితే చాలు వారిపై క్రిమినల్ కేసులు నమోదు అవుతున్నాయి. ఎమర్జెన్సీ కాలంలో ఎం.కె. స్టాలిన్ అనుభవించిన మీసా నిర్బంధాన్ని అసెంబ్లీలో విజయ్ ప్రశ్నిస్తూ ఎద్దేవా చేయడంతో మొదలైన ఈ రగడ.. డీఎంకే సెప్టెంబర్ 12న చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనలతో వీధులకెక్కింది. అయితే, ఆ ఆందోళనల్లో మాట్లాడిన కీలక నేతలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు వరుసగా కేసులు బనాయించడం డీఎంకే వర్గాల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.తమిళనాడు పోలీసులు ఇప్పటివరకు ముగ్గురు కీలక డీఎంకే ప్రజాప్రతినిధులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఎంపీ ఎ. రాజాపై సైదాపేట పీఎస్‌లో ఏడు సెక్షన్ల కింద కేసు నమోదైంది. చెన్నై కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసనలో సీఎం తీరును ఎండగట్టినందుకు హార్బర్ ఎమ్మెల్యే శేఖర్ బాబుపై ఆరు సెక్షన్లతో మరో ఎఫ్ఐఆర్ దాఖలైంది. కళ్లకురిచ్చిలో ఎమ్మెల్యే వసంతం కార్తికేయన్‌పై కూడా స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు కీలక నేతలతో పాటు నిరసనల్లో పాల్గొన్న పలువురు జిల్లా స్థాయి కేడర్‌పైనా నిఘా పెట్టారు.ప్రతిపక్ష గొంతును నొక్కేందుకు అధికార యంత్రాంగాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి టి.కె.ఎస్. ఇళంగోవన్ సహా ముఖ్యనేతలు మండిపడుతున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ శాంతిభద్రతల వైఫల్యం, లాకప్ మరణాలు, మహిళలపై దాడుల గురించి ఆధారాలతో నిలదీసినప్పుడు ఎలాంటి సమాధానం ఇవ్వలేని ప్రభుత్వం.. డీఎంకే నేతల వ్యక్తిగత విమర్శలను సాకుగా చూపి కేసులు పెడుతోందని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో అసలైన నేరస్థులు, చట్టాన్ని ఉల్లంఘించే వారిని వదిలేసి, రాజకీయ ప్రత్యర్థులపైనే దృష్టి పెట్టడం ఏ రకమైన పాలన అని ప్రశ్నిస్తున్నారు.విమర్శల స్థాయి దాటి కుటుంబ సభ్యులపై, అసభ్యకరమైన వ్యక్తిగత దూషణలకు దిగడం డీఎంకే అగ్రనేతలకు కూడా సమస్యగా మారింది. రాజా చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీ ఎంపీ కనిమొళితో పాటు మిత్రపక్ష వీసీకే నేత తిరుమావళవన్ సైతం అసంతృప్తి వ్యక్తం చేయడం, రాజా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. రతిపక్షంలోని కీలక ఎంపీ, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై నాన్-బెయిలబుల్ సెక్షన్లతో కేసులు పెట్టడం అనేది రాజకీయ కక్షసాధింపుగానే ప్రజల్లోకి వెళ్లే అవకాశం కనిపిస్తోంది.

అనిల్ కు దూరమౌతున్న నెల్లూరు

నెల్లూరు, నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అడుగులు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా అనిల్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టిని ఆకర్షించేందుకు, అధికార కూటమి నేతలతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, అనిల్ పడుతున్న ఈ ఆరాటం క్షేత్రస్థాయిలో ఆయనకు రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందా అంటే.. సాధ్యం కాదనే సమాధానమే సొంత పార్టీ వర్గాల నుంచే వస్తోంది.జగన్ మోహన్ రెడ్డి నైజం తెలిసిన ఎవరికైనా అనిల్ ఆశలు నెరవేరడం అంత సులువు కాదని అర్థమైపోతుంది. ప్రస్తుతం నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. జగన్‌కు అత్యంత విశ్వసనీయుడిగా, ఆర్థికంగా , సామాజికంగా బలంగా ఉన్న చంద్రశేఖర్ రెడ్డిని పక్కనపెట్టి, గత ఎన్నికల్లో నరసరావుపేటకు వెళ్లి ఓటమిపాలై మళ్లీ నెల్లూరుకు వచ్చిన అనిల్ చేతికి సిటీ బాధ్యతలు అప్పగించే సాహసం జగన్ చేయకపోవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీ అధిష్ఠానం ఆలోచన శైలి ప్రకారం.. ఒకసారి నియోజకవర్గం మారిన తర్వాత లేదా ఓటమిపాలయ్యాక మళ్లీ పాత స్థానానికి పూర్తి స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వడం దాదాపు అసాధ్యం.మరోవైపు నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీలోని ప్రధాన రెడ్డి సామాజికవర్గ నేతలెవరూ అనిల్ కుమార్ యాదవ్‌ను మళ్లీ జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పనిచ్చేందుకు సిద్ధంగా లేరు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రదర్శించిన ఏకపక్ష వైఖరి, సొంత పార్టీ నేతలతోనే విభేదించిన తీరు ఇంకా వారి మనసుల్లో మెదులుతూనే ఉంది. బిసి కార్డును వాడుకుని మళ్లీ తమ సామాజికవర్గానికి దక్కాల్సిన రాజకీయ అవకాశాలు, పట్టును అనిల్ కొట్టేస్తారనే భయం వారిలో బలంగా ఉంది. అందుకే జిల్లాలోని రెడ్డి సామాజికవర్గ సీనియర్లు అంతా అంతర్గతంగా అనిల్‌కు వ్యతిరేకంగా ఏకమవుతూ, ఆయనకు సిటీ బాధ్యతలు రాకుండా అధిష్ఠానం వద్ద గట్టిగానే అడ్డుకట్ట వేస్తున్నట్లు సమాచారం.స్థానిక ఎన్నికల హడావుడిని అడ్డం పెట్టుకుని, వేమిరెడ్డి దంపతులపై అనవసరమైన ఆరోపణలు, హడావుడి వ్యాఖ్యలు చేయడం ద్వారా తానే జిల్లాలో వైసీపీ తరపున ఏకైక పోరాట యోధుడినని ప్రొజెక్ట్ చేసుకోవడానికి అనిల్ ప్రయత్నిస్తున్నారు. అయితే, గతంలో వైసీపీలోనే ఉండి పార్టీకి కొండంత అండగా నిలిచిన వేమిరెడ్డిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అనిల్‌కు పార్టీ శ్రేణుల నుంచి కూడా పెద్దగా మద్దతు లభించడం లేదు.పైగా ఈ రకమైన అతి దూకుడు వల్ల స్థానికంగా ప్రశాంతంగా ఉన్న కేడర్‌లో కూడా అనవసర ఉద్రిక్తతలు పెరుగుతు న్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అనిల్ కుమార్ యాదవ్ ఎంతగా హడావుడి చేసినా, జగన్‌ను మెప్పించేందుకు ఎంతటి తీవ్ర వ్యాఖ్యలు చేసినా, రాబోయే రోజుల్లో ఆయనకు నెల్లూరు సిటీ టికెట్ లేదా ఇన్ ఛార్జ్ పదవి దక్కే అవకాశాలు దాదాపు శూన్యమనే ప్రచారం నెల్లూరు రాజకీయా ల్లో గట్టిగా సాగుతోంది. స్వపక్షంలోనే సీనియర్ల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకత, అధిష్ఠానంలో చంద్రశేఖర్ రెడ్డికి ఉన్న ప్రాధాన్యత, జగన్ రాజకీయ వ్యూహాల దృష్ట్యా అనిల్ నెల్లూరు రీ-ఎంట్రీ ఒక కలగానే మిగిలిపోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పులివెందులలో మారుతోన్న సీన్

కడప, పులివెందుల అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కోట. అక్కడ ఏ గొడవలు జరిగినా, రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్నా అది కేవలం వైసీపీలోని అంతర్గత వర్గాల మధ్యనే సాగేది. ప్రత్యర్థి పార్టీల ఉనికి నామమాత్రంగానే ఉండటంతో, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చెప్పిందే వేదంగా చెల్లుబాటు అయ్యేది. అయితే 2024 ఎన్నికల ఓటమి తర్వాత పులివెం దులలో సీన్ పూర్తి గా మారిపోయింది. దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యం చలాయించిన వైసీపీ నాయకులు ఇప్పుడు సైలెంట్ కావడం, చాలామంది దారి చూసుకోవడం లేదా పక్కకు తప్పుకోవడంతో అక్కడ వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో అడుగంటిపోతోంది.

భీమేశ్వర స్వామికి లక్ష్మి కటాక్షం.. రికార్డ్ స్థాయిలో హుండీ ఆదాయం

రాజన్న సిరిసిల్ల: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఖజానాకు శ్రావణమాసంలో రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. శ్రావణమాసం సందర్భంగా గత 28 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ భీమేశ్వర స్వామి వారికి హుండీలో సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను బుధ, గురువారాలలో ఆలయ సిబ్బంది లెక్కించారు. మొదటిరోజు రూ. 1.91 కోట్ల నగదు లభించగా, రెండవ రోజు రూ. 1.81 కోట్ల ఆదాయం సమకూరింది. మొత్తం కలిపి రూ. 3,72,78,809 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో రమాదేవి వెల్లడించారు. రెండు రోజుల్లో కలిపి 201 గ్రాముల 400 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 16 కిలోల 600 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు వెల్లడించారు.

కేంద్రంలో మళ్లీ ధర్డ్ ఫ్రంట్ ? ఇండీ కూటమిని కెలుకుతున్న డీఎంకే..!

చెన్నై:తమిళనాడులో దశాబ్దాలుగా తమకు నమ్మకమైన మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ.. విజయ్ టీవీకే స్థాపించి అధికారంలోకి రాగానే, తమకు ఝలక్ ఇచ్చి ఆయన కూటమిలో చేరిపోవడంతో డీఎంకే రగిలిపోతోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్న డీఎంకే.. ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమిలో ఉండలేక, బయటికి వెళ్లలేక సతమతం అవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా డీఎంకే అధినేత స్టాలిన్ సోదరి, ఎంపీ కనిమొళి రంగంలోకి దిగారు.

డీఎంకే థర్డ్ ఫ్రంట్ ప్రయత్నాలు

ఇప్పటికే కనిమొళి ముంబై వెళ్లి ఉద్ధవ్ శివసేన నేత ఉద్ధవ్ థాక్రేను, ఢిల్లీలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేను కలిశారు. అనంతరం బెంగాల్ వెళ్లి మాజీ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీని కలిసేందుకు కనిమొళి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇలా ఇప్పటికీ ఇండీ కూటమిలో ఉన్న పలు ప్రాంతీయ పార్టీలను కలుపుకుని థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకు డీఎంకే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం డీఎంకేకు తమిళనాడులో అసెంబ్లీ కంటే జాతీయ స్థాయిలో ఎక్కువగా బలం ఉంది. లోక్ సభలో 22 మంది, రాజ్యసభలో 11 మంది కలుపుకుని డీఎంకేకు మొత్తం పార్లమెంట్ లో 33 మంది ఎంపీలున్నారు. వీరిలో కనీసం 22 మంది ఎంపీలు 2029 వరకూ లోక్ సభలో ఉంటారు.

ఇండీ కూటమిపై ఫోకస్

ఈ బలాన్ని చూపి, ఇండీ కూటమిలోని ప్రాంతీయ పార్టీల్ని ఆకర్షించేందుకు కనిమొళి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇండియా కూటమి సమావేశాలకు డీఎంకే హాజరు కావడం లేదు. డీఎంకే మైఖరి వల్ల అటు విజయ్ టీవీకే సైతం ఇండీ కూటమిలోకి రాలేకపోతోంది. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు, తన పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కనిమొళి రాసిన లేఖపై స్పీకర్ ఓం బిర్లా సానుకూలంగా స్పందించి ప్రత్యేక సీటింగ్ ఇచ్చారు. ఆగస్టులో స్పీకర్ ఏర్పాటు చేసిన సాంప్రదాయ టీ పార్టీని ఇండీ కూటమి బహిష్కరించినా, కనిమొళి మాత్రం హాజరయ్యారు.

ధర్డ్ ఫ్రంట్ ప్రయోగాలన్నీ విఫలం

అయితే కాంగ్రెస్ లేకుండా ధర్డ్ ఫ్రంట్ ఆలోచనలు గతంలో చాలా రాజకీయ పార్టీలు చేసి విఫలమయ్యాయి. 2013లో కాంగ్రెసేతర, బీజేపీయేతర పార్టీలతో సమాఖ్య కూటమిని ఏర్పాటు చేయాలని మమతా బెనర్జీ స్వయంగా ప్రతిపాదించారు. ఐదేళ్ల తర్వాత 2019 ఎన్నికలకు ముందు అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్‌లతో భేటీలు నిర్వహించారు. అయినా ఎన్నికలకు ముందు అవి కాస్తా నీరుగారిపోయాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ప్రతిపక్ష రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ముఖ్యమంత్రులకు విందుకు ఆహ్వానం పంపినా ఫలించలేదు. ఈసారి డీఎంకే చేస్తున్న ప్రయత్నాలకు ఏ మేరకు ఇతర విపక్ష పార్టీలు స్పందిస్తాయన్నది త్వరలో తేలిపోనుంది.

తిరగబడ్డ గులాబీ వ్యూహం..

హైదరాబాద్, తెలంగాణ శాసనసభ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు జరిపిన నిరసన, ఆ తదనంతరం జరిగిన ఘర్షణల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. చట్టసభల ప్రాంగణంలో ఆందోళనను తీవ్రంగా పరిగణించి, ప్రతిపక్షంపై రాజకీయ మైలేజ్ సాధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగింది. బీఆర్ఎస్ అగ్రనేతలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయడం, చివరికి మాజీ మంత్రి కేటీఆర్ పిఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేష్‌లను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో గంటల తరబడి హాజరుపరచడం వరకు వ్యవహారాన్ని తీసుకెళ్లారు. అయితే, ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి రాజకీయ ప్రయోజనాన్ని ఆశించిందో, అంతకంటే ఎక్కువ రాజకీయ ప్రతికూలతలను ఎదుర్కొనే ప్రమాదంలో పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రజాప్రతినిధులపై నమోదు చేసిన తీవ్రమైన కేసులు, అలాగే విచారణ ప్రక్రియ శృతిమించడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ నేతలను చట్టబద్ధంగా కట్టడి చేయాలనే ఉద్దేశం వ్యూహాత్మకమే అయినప్పటికీ, కక్షసాధింపు చర్యల స్థాయికి వ్యవహారాన్ని తీసుకెళ్లారనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ సిబ్బందిని విచారిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ప్రవేశించి గొడవ పడటానికి యత్నించారనే వార్తలు కలకలం రేపాయి. పోలీస్ స్టేషన్ లోపలే కస్టడీలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించడం విచారకరం, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి అని కేటీఆర్ విమర్శించడంతో బీఆర్ఎస్ దీన్ని బలమైన పొలిటికల్ డిఫెన్స్ అస్త్రంగా మార్చుకోగలిగింది.విచారణాధికారులు , శాంతిభద్రతల యంత్రాంగం వైఫల్యం అని బీఆర్ఎస్ ప్రతిదాడి చేస్తోంటే, పోలీసు శాఖ మాత్రం దాడి ఆరోపణలను ఖండించి సీసీటీవీ ఆధారాలను తెరపైకి తెచ్చింది. అయినప్పటికీ, ప్రభుత్వం తమను వేధిస్తోందని చూపించే అవకాశం బీఆర్ఎస్‌కు దొరికింది. కేవలం ఒక నిరసన ఘర్షణను రాజకీయంగా వినాశకరమైన నేరం గా చిత్రీకరించబోయి, బీఆర్ఎస్ స్థానిక శ్రేణులకు సరికొత్త కసిని, సానుభూతిని కాంగ్రెస్ నాయకత్వమే అందించినట్లయింది. ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టాలనుకున్న ప్రభుత్వం, తానే సెల్ఫ్ గోల్ వేసుకుని ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. రాజకీయాల్లో అతిగా స్పందించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో సిట్ విచారణలు, సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ వంటి విజువల్స్ ద్వారా మీడియాలో మైలేజ్ సాధించవచ్చని భావించినా, అది కాస్తా వికటించి ప్రజాప్రతినిధుల సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారనే అభిప్రాయానికి దారితీసింది. శాంతిభద్రతల నిర్వహణలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలకు మైలేజ్ ఇచ్చేలా ప్రవర్తించడం వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఘటనను ఆసరాగా చేసుకుని ప్రతిపక్షం నోళ్లు మూయించాలనే కాంగ్రెస్ ప్రయత్నం, బీఆర్ఎస్‌కు తమ క్యాడర్‌ను తిరిగి సమీకరించుకోవడానికి ఒక మంచి అవకాశాన్ని ఇచ్చింది. ఈ ఓవర్ యాక్షన్ మూలంగా రాజకీయ లాభం కంటే కాంగ్రెస్ పార్టీ నష్టపోయే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. తక్షణమే ఈ వ్యవహారాన్ని సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయకపోతే, రాబోయే రోజుల్లో ప్రతిపక్షాల సానుభూతి వేవ్‌కు కాంగ్రెస్ సమాధానం చెప్పుకోవాల్సి ఉంది.

కొండా కు దారెటు...

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత హాట్ టాపిక్‌గా మారిన పేరు కొండా సురేఖ. మంత్రివర్గం నుంచి అనూహ్య పరిణామాల నేపథ్యంలో బర్తరఫ్ అయిన తర్వాత ఆమె రాజకీయ భవిష్యత్తు ఎటు వైపు పయనిస్తుందనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదని ఆమె బహిరంగంగానే స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మాత్రం ఇందుకు భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. పార్టీలో ఆమె పాత్ర, తీసుకుంటున్న నిర్ణయాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.మంత్రి పదవిని కోల్పోయిన తర్వాత కొండా సురేఖ అసెంబ్లీ సమావేశాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. అంతేకాకుండా, అత్యంత కీలకమైన సీఎల్పీ సమావేశానికి కూడా ఆమె హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలకు తావిచ్చింది. ఒక మంత్రిగా చక్రం తిప్పిన వ్యక్తి, అదే సభలో సాధారణ ఎమ్మెల్యేగా అడుగుపెట్టడం మానసికంగా కాస్త ఇబ్బందికరంగా ఉండడం సహజం. కానీ, ఇది కేవలం వ్యక్తిగత ఇబ్బంది మాత్రమే కాదని, పార్టీ నాయకత్వం అవలంబిస్తున్న వైఖరిపై, తనను బర్తరఫ్ చేసిన తీరుపై ఆమె నిరసన గళం వినిపిస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ తీరుపై అలిగినందుకే ఆమె సభకు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే వాదన బలపడుతోంది.మరోవైపు, మాజీ ఓఎస్డీకి సంబంధించిన వ్యవహారం కొండా సురేఖను మరింత ఇబ్బందికర పరిస్థితులోకి నెట్టింది. ఈ అంశానికి సంబంధించి పోలీసులు తనను, తన అనుచరులను అనవసరంగా వేధిస్తున్నారంటూ ఆమె తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఉంటూనే ఇలాంటి పోలీసు వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం, సొంత పార్టీ నుంచి తగిన రక్షణ లేకపోవడం ఆమెను తీవ్ర మనస్తాపానికి గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఆమెను పార్టీ అధిష్ఠానానికి దూరం చేస్తున్నాయా లేక మరింత ఒంటరి చేస్తున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.ఈ వివాదాల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్వయంగా కొండా సురేఖకు ఫోన్ చేశారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారంటూ పెద్ద ఎత్తున వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం మాత్రమేనని పార్టీ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. అధిష్ఠానం నుంచి ఎలాంటి అధికారిక జోక్యం లేకపోవడం లేదా ఈ అంశంపై హైకమాండ్ మౌనం వహించడం వెనుక వ్యూహం ఏమిటనేది అంతుచిక్కడం లేదు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని చెబుతూనే, మరోవైపు కీలక సమావేశాలకు, అసెంబ్లీకి పూర్తిగా దూరంగా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సురేఖ అనుసరిస్తున్న ఈ వ్యూహం భవిష్యత్తులో ఎలాంటి సంచలన నిర్ణయాలకు దారితీస్తుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మంత్రి పదవి కోల్పోయిన బాధ, మాజీ ఓఎస్డీ వ్యవహారంలో ఎదురవుతున్న ఒత్తిళ్లు, పార్టీ అంతర్గత సర్దుబాట్ల మధ్య కొండా సురేఖ భవిష్యత్తు ఎలా ఉంటుందనేది అత్యంత ఆసక్తిగా మారింది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140